## 64

# బతుకు పూలబాట కాదు

అనుకొన్నవన్నీ అనుకొన్నట్లుగా జరిగితే, ఈ పాటికి మనకో కొత్త హీరో, తెలుగు తెరమీద దర్శనం ఇచ్చి యుండవలసింది. ఇప్పుడున్న హీరోలుగా అదనంగా మరో సంఖ్యలో కలవవలసి వచ్చేది. కాలం ఖర్మం కలిసిరాలేదు. నాగరాజు హీరో కాలేకపోయాడు.

చిత్రమేమిటంటే, హీరోకు కావలసిన లక్షణాలన్నీ తనకున్నాయని ఇప్పటికీ నాగరాజు నమ్ముతూ ఉండడం.

"నాకు చిన్నతనం నుండి నాటకాలంటే చెడ్డపిచ్చి. నా పదోయేట 'ధ్రువ' నాటకంలో చిన్న ధ్రువుడు వేషం వేశా. పదిహేనో ఏట 'హరిశ్చంద్ర'లో లోహితాస్యుడు వేషం వేసి, మొదటి ప్రయిజు సంపాదించా. ఈ నాటకాల పిచ్చిలో పడి నా చదువు గుంటపూలు పూసింది" అన్నాడు నాగరాజు.

ఇప్పటి సంగతి తెలియదుగానీ ఒకప్పుడు నాగరాజు బాగా పాడేవాడుట. అతనికిష్టమైన రాగాలు అరడజను దాకా వున్నాయి. శంకరాభరణం, ఆనందభైరవి, నాదనామప్రియ శ్రీరాగం, మాండ్, బిళహరిరాగాలు తనకు చాలా ఇష్టమైనవన్నాడు నాగరాజు. తనకంటూ ప్రత్యేకంగా ఒక నాటక సమాజం లేదని, కానీ రకరకాల సమాజాల వాళ్ళు తనను పిల్చి వేషాలిచ్చేవాళ్ళని చెప్పుకొచ్చాడు.

"మీరు నమ్మరేమోకానీ, ఈ నాటకాలాడడం, ఆడించడం, పెద్ద పిచ్చిలాంటిది బాబుగారూ! రెండామడల దూరంలో ఎక్కడ నాటకమున్నా పోయేవాడిని, ఎవ్వరూ టిక్కెట్టు అడిగేవారుకాదు. అంతా తెలిసిన జనమేనాయె. ఈ తిక్క వొదిలించడానికి మా నాన్న నన్ను చితక బాదాడు. కూడూ, నీళ్ళు పెట్టకుండా, కొట్టంలో కట్టి పడేశాడు. అయినా వదిలింది కాదు అన్నాడు నాగరాజు. అతని నాటకాలు చాలా ఊళ్లలో ప్రదర్శితాలైనాయి. నెల్లూరు, గూడూరు, సూళ్ళూరు పేట, కదిరి, ఆనంతపురం, పెనుగొండ, కర్నూలు, నిజామాబాద్, విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం, అనకాలపల్లి, తుని, కాకినాడ... తిరగని వూరు లేదు.

అలా తిరుగుతున్నప్పుడే అతనికి సినిమాల మీదికి దృష్టి పోయింది. రెండుసార్లు మద్రాసుకు కూడా వెళ్ళొచ్చాడు. చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డి, చక్రపాణిగార్లను చూసాడు. కొంతమంది అతన్ని పూర్తిగా నిరుత్సాహపరిచారు. మిగలిన ఇద్దరూ (ఆ ఇద్దరెవరో నాగరాజు చెప్పలేదు) "అడ్రసు ఇచ్చి వెళ్ళు. అవసరమయినప్పుడు కబురుపెడతాం" అన్నారు. నాగరాజు అడ్రసు ఇచ్చి వచ్చాడు. ఏ క్షణాన్నయినా తనకు పిలుపు రావచ్చునని మాసాలకొద్దీ ఎదురు చూసాడు. ఆఖరికి ఉండబట్టలేక రెండవసారి మద్రాసు వెళ్ళాడు. అడ్రసు ఇచ్చివెళ్ళమన్న పెద్ద మనుషులీ నానా శ్రమలు పడి కలుసుకున్నాడు. అతనెవరో తెలియనట్లుగానే వాళ్ళు మాట్లాడారు.

"నాకు చాలా ఆశ్చర్యమేసింది. సిగ్గుపడ్డాను. ఉన్న డబ్బు పూర్తి అయిపోకముందే రైలెక్కాను" అన్నాడు నాగరాజు.

కానీ సంపాదన లేకపోగా వేయిన్నరదాకా ఖర్చు పెట్టిన కొడుకును చూసి రామకోటయ్యగారు లబ్బుమని గోలకెత్తారు. పని చేయకపోతే పీడపోయింది. కనీసం ఖర్చులన్నా తగ్గించుకుంటే చాలునన్న దశలోకి వచ్చాడు రామకోటయ్య.

నాగరాజుకు తన టాలెంట్స్‌మీద అపారమైన విశ్వాసాలున్నాయి. ఏదో ఒకనాటికి తన ప్రతిభను

తెలుగుదేశం గుర్తించి తీరుతుందన్న ఆత్మవిశ్వాసం అతనికి ప్రగాఢంగా ఉన్నది. అవకాశం కోసం ఎదురు చూడసాగాడు. చివరికి అటువంటి ఛాన్సురానే వచ్చింది.

ఒకసారి ప్రకాశం బ్యారేజీ వద్ద నిలబడి ఏదో సినిమా పత్రిక చూస్తున్నాడు... ''....'' చిత్రవారి నూతన చిత్రంలో నటించడానికి నూతన నటీనటులు కావాలి. వివరాలకు ఈ దిగువ వారిని సంప్రదించండి'' అన్న ప్రకటన, చిరునామా కనిపించాయి. నాగరాజుకు కళ్ళు మెరిసాయి. ఆ అడ్రసు విజయవాడదే. ఇంకేం! ఆ మరునాడే ఆ అడ్రసు ప్రకారం వెళ్ళి అక్కడున్నవారి దర్శనం చేసుకొన్నాడు.

''నా సంగతంతా చెప్పానండీ, చెప్పకముందే వారికి నా గురించి తెలుసునట, నన్ను తప్పకుండా తీసుకొంటానన్నారు. సెకండ్ హీరో వేషమిస్తామన్నారు. కథ కూడా చెప్పారు. చాలా మంచి కథ. అయితే ఒక్కటే షరతు. తన కంపెనీలో 10 వేల రూపాయల షేర్లు కొనమన్నారు'' అన్నాడు నాగరాజు.

ఈ వాటా ధనం కోసం నాగరాజు తండ్రితో భాగాలుపంచుకొన్నాడు. తన ఇస్సాకు వచ్చిన నాలుక్కుంటల భూమిని అమ్మేశాడు. ఇలాంటి భాగస్తులు మరో ముగ్గురు చేరారు. అందరూ కలసి మద్రాసులో మకాం పెట్టారు. కథ గురించి చర్చించారు. టాక్సీల మీద తిరిగారు. హొటళ్ళకు, సీసాలకు, అమ్మాయిలకు తగలేశారు.

''ఒక రోజు ఉదయం మేం నలుగురం తప్ప ప్రొడ్యూసర్ కనబడలేదండీ. చాలా చోట్ల వెతికాం. వారు బొంబాయి పారిపోయాండని అన్నారు. రైల్లో టిక్కెట్టు లేకుండానే బెజవాడ వరకు వచ్చా'' అన్నాడు నాగరాజు

.ఈ అనుభవంతో అతని నసాళం అదిరింది. సినిమా పిచ్చి వదిలింది. నాటకాల మోజు కూడా తీరిపోయింది. తండ్రి ఇంటికి రావద్దన్నాడు. కానీ తల్లి పేగు ఉండలేదు కదా! తన తమ్ముని చాటుగా పిలిచి గోలకెత్తింది. ఆయన అక్కగారి మాటను కాదనలేక మేనల్లుణ్ణి దగ్గరకు తీశాడు.

''ఇది మా మేనమామగారి షాపేనండి! ఇక్కడే ఉంటున్నా మొదట్లో పువ్వులు అమ్మడ మంటే చచ్చిన చావుగా ఉండేది. కానీ కడుపు మండుతుంటే ఏం చేస్తాం చెప్పండి. రెండేళ్ళ నుంచి అక్కడే ఉంటున్నా ఇప్పుడీ వ్యాపారంలోని లజ్జుగుజ్జులన్నీ నాకు తెలుసు'' అన్నాడు నాగరాజు.

వాళ్ళు క్రిందటేడాది ఓ మల్లెతోటను గుత్తకు తీసుకొన్నారు. గాలివానకు తోట యావత్తు కూలిపోయి బోలెడన్ని నష్టాలొచ్చాయి. అందుకని మారుబేరానికి పూలు తెచ్చి అమ్ముతుంటారిప్పుడు.

ఇందులో నష్టం ఉండదండీ! కొన్న ధరమీద, నాలుగయిదు రెట్లు ఎక్కువ రేట్లు వేసుకొని అమ్ముతాం. సగానికి సగం పూలు చెడిపోయినా లాభం ఉంటుంది. లెక్కబెట్టి పూలు కొన్నా తూకానికికొన్నా మా 'చేవాటు' మాకుంటుంది. చెప్పిన ధరకే కొంటే తూకాలు సరిగ్గా ఉంటాయి. గీసి గీసి బేరమాడితే, పూల మీద నీళ్ళు చల్లుతా. మూగరాళ్ళతో తూస్తా. కొంత లాభం తగ్గించుకొంటేనే తప్ప అసలులో నష్టపోలేను గదా!'' అన్నాడు నాగరాజు.

''సినిమాల శతదినోత్సవాలప్పుడు, పెళ్ళిళ్ళప్పుడూ, ఎన్నికలప్పుడూ, ఎవరన్నా మంత్రులు వచ్చినప్పుడూ గిరాకీ బాగా ఉంటుందన్నాడు నాగరాజు.

''అయిదు రూపాయల నుంచి, అయిదొందల రూపాయల దండదాకా కడతామండి. మల్లెలు, గులాబీలు, చామంతులు, దవనం, మరువం, సంపెంగ చెమికి, పన్నీరు బుడ్లు అన్నీ ఉంటాయి.

నేను కట్టిన పూల దండల్ని ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్ కూడా వేసుకున్నారండి" అంటూ వాళ్ళ ఫొటోలను చూపించాడు నాగరాజు.

ఇంత చేసినా పెద్ద మిగిలి చచ్చేదేమీ ఉండదని, పొట్టకూ - బట్టకూ వెదుకులాట లేకుండా గడిచిపోతుందని అన్నాడు.

ఈ యేడే పెళ్ళయింది. మా మేనమామకూతురే లెండి. వేరే ఉంటున్నా కృష్ణలంకలో అద్దె ఇల్లే అని చప్పిరించేశాడు నాగరాజు.

తనకో స్వంత కొంప యేర్పాటు చేసుకోవాలనే ఉన్నదనీ, తనకు, మేనల్లుళ్ళకు పడకపోవటం వల్లనే వేరే ఉంటున్నానని ఇక జన్మలో సినిమాల జోలికి పోనని నాగరాజు అన్నాడు. అతని మాట మీద ఎంత కాలం నిలబడి ఉండేది ఇప్పుడప్పుడే చెప్పలేం.